అల్ల నేరేడు.. పోషకాలు మెండు

- ఆరోగ్యఫల ప్రదాయనిగా గుర్తింపు
- సీ విటమిన్ పుష్కలంగా లభించే సీజనల్ ఫ్రూట్
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు దివ్యౌషధం
- మార్కెట్‌లో లభిస్తున్న నేరేడు
- విరివిగా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



విక్రయానికి సిద్ధంగా అల్లనేరేడు

తిరుపతి సిటీ: ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఒకటైన ఆరోగ్య ఫల ప్రదాయనిగా పిలచే అల్లనేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి సంపూర్ణంగా మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా ఆకులు, చెట్టు బెరడు, గింజలు కూడా శరీరానికి చక్కని మేలు చేస్తాయి. అల్లనేరేడు పండులో అత్యధిక పోషకాలు ఉన్న నేపథ్యంలో పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్ క్రీమ్ తయారీలో పెద్దఎత్తున వాడుతున్నారు. దీంతో పాటు నేరేడు కాయలను వెనిగర్, వైన్‌తయారీలో ప్రముఖంగా వినియోగిస్తున్నారు. నేరేడు పండ్లు కోయడం చాలా వ్యయంతో కూడుకున్నది కావడంతో ధర అధికంగానే ఉంటుంది. రైతుల వద్ద దళారులు కేజీ రూ.80కి కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.160కి విక్రయిస్తున్నారు. వినియోగదారుల చేతికొచ్చే సరికి ధర రూ.270 నుంచి రూ.300 పలుకుతోంది. అందులో నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తున్నారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధాన పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు రెండు చొప్పున నేరేడు పండ్లు తింటే వ్యాధులు రాకుండా దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

అల్లనేరేడు పండ్లతో ప్రయోజనాలు ఇవే..!

- నేరేడు పండ్లలో ఐరన్, క్యాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- వ్యాధి నిరోధకశక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది
- మూత్ర సమస్యల నియంత్రణలో ఎంతో ఉపయోగపడుతుంది
- ఆకలిని పెంచే గుణంతో పాటు శరీరంలోని పైత్యాన్ని తగ్గిస్తుంది
- అల్లనేరేడు చెక్క నుంచి తీసిన కషాయం అతిసార, నీళ్ల విరోచనాలు, జ్వరాన్ని తగ్గిస్తుంది
- విత్తనాలను ఎండబెట్టి చూర్ణం చేసి తీసుకుంటే మధుమేహం కంట్రోల్ అవుతుంది.
- కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి
- కాలేయం పనితీరును మెరుగు పర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది
- యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పనిచేస్తాయి
- దంతాలు, చిగుళ్ల ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్త స్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది
- అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా ఇస్తుంది.

అధికంగా తింటే..అనర్థాలు తప్పవు

- నేరేడు పండ్లు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవిస్తాయి. వగురు రుచి కలిగిన నాణ్యత లేని పండ్లను భుజిస్తే గొంతు నొప్పి సంభవించవచ్చు.
- సీజన్ మారే సమయంలో వచ్చే అల్ల నేరేడు పండ్లను మితంగా తినాలి
- ఉబ్బసం ఉన్నవారు ఈ పండ్లను మితంగా తినాలి. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.

ఆరోగ్యానికి దివ్యౌషధం



అల్ల నేరుడు పండ్లు ఆరోగ్యానికి దివ్యౌషధంగా పనిచేస్తాయి. శరీరంలోని అనేక రుగ్మతలను నివారిస్తాయి. ఐరన్, క్యాల్షియం, పొటాషియం ఎక్కువగా ఉంటుంది. సీ విటమిన్ నేరేడు ద్వారా శరీరానికి అధికంగా లభిస్తుంది. సీజనల్ ఫ్రూట్‌గా పిలవబడే అల్లనేరేడు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతగానో మేలు చేస్తుంది. ఇందులో జంబోలిన్ ఉండడం వల్ల విత్తనాలు చూర్ణం చేసి తీసుకుంటే మధుమేహం కంట్రోల్‌లో ఉంటుంది. మితంగా తినాలి. అతిగా తింటే జలుబు, దగ్గుతో పాటు శ్వాసకోస వ్యాధులకు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్, ఎస్వీ ఆయుర్వే కళాశాల, తిరుపతి

క్లుప్తంగా

గంగమ్మ సేవలో మేయర్ శిరీష



గంగమ్మను దర్శించుకుంటున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మను మంగళవారం నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష దర్శించుకున్నారు. జాతర తర్వాత చేపట్టే మరుపొంగళ్ల నేపథ్యంలో మూడవ మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా పండ్లతో అలంకరణతో కొలువుదీర్చారు. ఈమేరకు ఆలయానికి విచ్చేసిన మేయర్ శిరీషకు ఆలయ ఈవో కె.మమత, అర్చకులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం ఆమెకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు రాగి జావ, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో రామచంద్రాపురం మండలం పార్వతీపురం గ్రామానికి చెందిన బి.సుబ్రహ్మణ్యంకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. చంద్రగిరి మండలం, మల్లయ్యపల్లికి చెందిన పి.రాజేశ్వరి వద్ద సుబ్రమణ్యం 2017 ఏప్రిల్ 10వ తేదీ రూ.4 లక్షలు అప్పుగా తీసుకొని ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అతను 2018 జూలై మూడో తేదీ ఓ చెక్కును ఆమెకు ఇచ్చాడు. ఆమె ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో ఆమె కోర్టులో అతనిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సుబ్రహ్మణ్యంకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం అభిషేకాలు, ధూప, దీప నైవేద్య, హారతులు సమర్పించారు. అనంతరం కాలభైరవస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయస్థూపం వరకు ప్రదక్షిణగా వెళ్లి ఆలయంలోకి కొలువు దీర్చారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందగిరి దేవస్థానం చైర్మన్ రాజీనామా

పాకాల: ఊట్లవారిపల్లికి సమీపంలోనే ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవికి మహాసముద్రం పట్టాభిరెడ్డి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టాభిరెడ్డి తన రాజీనామా పత్రాన్ని సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారికి అందజేశారు. అనంతరం పట్టాభిరెడ్డి మాట్లాడుతూ స్వామివారికి సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు సంవత్సరాలపాటు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రమాణ స్వీకార వీక్షణకు ఏర్పాట్లు

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షించడానికి తిరుపతి రూరల్ మండలంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎంపీడీఓ రమేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో అతి పెద్ద టీవీని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి ప్రమాణస్వీకార వేడుకను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, స్థానిక ప్రజలు సైతం ఈ ప్రత్యక్ష ప్రసార వేడుకలను వీక్షించవచ్చని ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు.

ఎంసెట్ ఫలితాల్లో ప్రతిభ



షేక్ హాషీఫా



జి.నిశ్చల్



కె.ప్రేమజ



టి.మణిదీప్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ ఎంసెట్ ఇంజినీరింగ్ స్ట్రీమ్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని అమరావతి ఐఐటీ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో షేక్ హాషీఫా 528, జి.నిశ్చల్ 613, కె.ప్రేమజ 819, టి.మణిదీప్‌రెడ్డి 886వ ర్యాంకులు సాధించారు. వీరితో పాటు తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ అకాడమీ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ పార్థీవ్‌రెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులను వారు అభినందించారు.

సింగిల్‌విండో చైర్మన్ రాజీనామా



పాలకమండలి సభ్యులతో కలసి చైర్మన్ పదవికి రాజీనామా లేఖను అందజేస్తున్న మల్లం చంద్రమౌళిరెడ్డి

చంద్రగిరి: మండల పరిధిలోని నరసింగాపురం సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, పాలక మండలి సభ్యులు ఈశ్వర్ రెడ్డి, మురగారెడ్డి తమ పదవులకు మంగళవారం రాజీనామాలు చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను బ్యాంక్ ఇన్‌చార్జ్ అధికారి భాస్కర్ రెడ్డికి అందజేశారు. నరసింగాపురం సింగిల్‌విండోను 2013 నుంచి నరసింగాపురం సింగిల్‌విండో చైర్మన్‌గా మల్లం చంద్రమౌళి రెడ్డి కుటుంబ సభ్యులు కొనసాగారు. రైతులకు విరివిగా రుణాలు ఇచ్చి బ్యాంకు ఆదాయానికి తోడ్పడ్డారు. ఇండియన్ బ్యాంకు అప్పు తీర్చడమే కాక బ్యాంకుకు ఎన్నో ఆస్తులను సమకూర్చారు. చంద్రగిరిలో అద్దె భవనంలో ఉన్న సింగిల్‌విండో బ్యాంకును శాశ్వత భవనం ఏర్పాటు చేయడం మల్లం చంద్రమౌళి రెడ్డి ఘనతగా చెప్పుకోవచ్చు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కోట్లాది రూపాయలు విలువచేసే కార్యాలయాన్ని నిర్మించి, పలు షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తూ సింగిల్‌విండో బ్యాంకుకు శాశ్వత ఆదాయం వచ్చేటట్లు చర్యలు తీసుకున్నారు. ఎంతో ఉన్నత స్థానంలో సింగల్ విండో బ్యాంకును నిలిపి ఆదాయ వనరులను సమకూర్చిన మల్లం చంద్రమౌళి రెడ్డి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తన పదవికి రాజీనామా చేశారు. బ్యాంకుకు 11 సంవత్సరాలుగా చంద్రమౌళి రెడ్డి చేసిన సేవలు ఎనలేనివని బ్యాంక్ అధికారులు కొనియాడారు. తమ రాజీనామాలను ఆమోదించాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రమణయ్యయాదవ్ మృతికి నివాళి



రమణయ్యయాదవ్ మృతికి నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాజీ మిరాశి పలకల రమణయ్యయాదవ్ మృతి చెందారు. ఆయన మృతదేహానికి తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు.

అలరించిన ద్రౌపదీ స్వయంవరం



ఉత్సవ మూర్తి ఊరేగింపు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం శ్రీద్రౌపదీసమేత ధర్మరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భాగవతారిణి రెడ్డెమ్మ గానం చేసిన ద్రౌపదీ స్వయంవరం హరికథ అలరించింది. ఉదయాన్నే శ్రీస్వామి,అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ద్రౌపదీ స్వయంవరం, సా యంత్రం బకాసుర వధ నాటక ప్రదర్శన జరిగింది. ఉత్సవ మూర్తులను పుర వీధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు పూజారి రవి తీర్థప్రసాదాలు అందించారు. సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు





శ్రీవారి ఆలయం ఎదుట భారత మాజీ క్రికెటర్ భారత్ అరుణ్, సినీ నటి ప్రియా ఆనంద్

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం భారత మాజీ క్రికెటర్ భారత్ అరుణ్, సినీనటి ప్రియా ఆనంద్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాద్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పరవశం.. తలకోన జలపాతం





ఎర్రావారిపాలెం మండలం, తలకోన అడవుల్లో కురిసిన వర్షాలకు స్థానికంగా ఉన్న జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. జాలువారుతున్న జలపాతంలో పర్యాటకులు తడిసి ముద్దవుతున్నారు. తలకోనలోని శిరోద్రోణం, నెలకోన మడుగులో నీటి ప్రవాహం ఆకట్టుకుంటోంది. భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

– భాకరాపేట

శిరోద్రోణం జలపాతంలో జాలువారుతున్న నీరు (ఇన్‌సెట్) నెలకోన మడుగు వద్ద జలపాతం

కళాకారుల సమస్యలపై చర్చ



కళాకారుల సమస్యలపై చర్చిస్తున్న జానపద వృత్తి కళాకారుల సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: టీటీడీలో కళాప్రదర్శనలతో సనాతన ధర్మప్రచారంలో భాగస్వాములవుతున్న కళాబృందాల సమస్యల పట్ల టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రాజెక్టు అధికారి రాజగోపాల్, ఏఈఓతో జానపద వృత్తి కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు పి.యాదగిరి మంగళవారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో, ఇతర టీటీడీ ఆలయాల ఉత్సవాలలో కళాప్రదర్శనలు నిర్వహించే కళాబృందాలకు తగిన సదుపాయాలు, అందించాల్సిన సౌకర్యాలను అందించే దిశగా చర్యలు తీసుకోవాలని కళాకారుల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. అలాగే కొత్త బృందాలను నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కళా ప్రదర్శన అందించిన కళాకారులకు అందించాల్సిన చార్జీల నగదు చెల్లింపులో అలసత్వంతో కళాకారులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి త్వరలో చార్జీల నగదు వారి బ్యాంకు ఖాతాల్లో సత్వరం జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కళాబృందాల మార్పులు, చేర్పుల విషయంలో సానుకూలంగా స్పందించి అవకాశం కల్పించాలని తెలిపారు. దీంతో స్పందించిన ప్రాజెక్ట్ అధికారి చార్జీలు ఎవరికైతే తమ బ్యాంకులలో పడలేదో వారు వెంటనే లిస్ట్ ఇస్తే వారికి చార్జీల సొమ్ములు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జానపద వృత్తి కళాకారుల సంఘం నేత కిరణ్ డోలా కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విత్తన దినోత్సవం



విత్తన దినోత్సవంలో పాల్గొన్న వ్యవసాయ పరిశోధనా స్థానం అధికారులు, శాస్త్రవేత్తలు

తిరుపతి సిటీ: స్థానిక పెరుమాళ్లపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో మంగళవారం విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌ఏఆర్‌ఎస్ సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ సీ.రమణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తన ఎంపికతో ఆరోగ్యకరమైన పంటతో పాటు అధిక దిగుబడికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు లోదుక్కులు, యాంత్రీకరణపై దృష్టి సారించాలని సూచించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇష్టాగోష్టి నిర్వహించి పలు సందేహాలను నివృత్తి చేసి పంట దిగుబడి పెంచేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలను తెలిపే కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌పీ వాసంతి, డాక్టర్ సుమతి, కేఆర్ ఠాగూర్, హేమలత, శ్రీవల్లీదేవి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో విచ్చేసిన రైతులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేతలు

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం రాష్ట్రప్రజలకు వారి సంక్షేమం, వాస్తవిక జీవన ప్రమాణాల అభివృద్ధి గురించి ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రమణ్యం, ఐఎఫ్‌టీయూ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాణి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ కూటమి ఇచ్చిన హామీలును నమ్మి ప్రజలు ఓట్లు వేసి విజయాన్ని అందించారని తెలిపారు. 2019కి ముందు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రప్రజల ఆశలను వమ్ము చేసిందని, వాటిని నెరవేర్చలేక ప్రజా విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితుల్లో అంతకంటే మించి హామీలను వైఎస్సార్‌సీపీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. టీటీడీలో ఖాళీ పోస్టులు భర్తీ చేసి పెరుగుతున్న భక్తుల తాకిడికి తగ్గట్టుగా ఉద్యోగుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. టీటీడీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేసి, ఉద్యోగులతో సమానంగా వారికి అన్ని వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ ఆశావర్కర్స్ యూనియన్ ప్రతినిధులు భారతి, కన్నమణి, రేఖ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఉడిపి మఠాధిపతి



అమ్మవారిని ఆలయంలో ఉడిపి సోదె వదిరాజ మఠాధిపతి శ్రీవిశ్వవల్లభ తీర్థ స్వామీజీ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మంగళవారం ఉడిపి సోదె వదిరాజ మఠాధిపతి శ్రీవిశ్వవల్లభ తీర్థ స్వామీజీ తన శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబు స్వామి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా మాతమ్మ కొలుపు ప్రారంభం





ఆలయంలో భక్తుల సందడి, ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలో శ్రీ రేణుక మాత పరమేశ్వరిదేవి ఆలయంలో వార్షిక కొలుపు ఉత్సవాలు మంగళవారం సాయంత్రం నుంచి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కాపుకట్టు కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రాంగణంలో పలు దేవతా చిత్రాల విద్యుత్ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం రాత్రి పుట్ట వద్ద కళాకారులతో రేణుక మాత పరమేశ్వరి కథా ప్రదర్శన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

బంగారమ్మతల్లీ.. పాహిమాం





శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో వెలసి ఉన్న శ్రీబంగారమ్మ ఆలయ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, నారికేళ జలాలు, కలశ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అంబలి పంపిణీ చేశారు. ఉదయం 9 గంటలకు గెరిగ ఉత్సవం ప్రారంభమైంది. వాయిద్యాలు, నృత్యాల సందడి నడుమ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం మైలు ముగ్గు, మధ్యాహ్నం పోతురాజు ముగ్గు వేశారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– శ్రీకాళహస్తి